# ఆనందో  బ్రహ్మ

– సాయి బ్రహ్మానందం గొర్తి

## స్వర్గం – నరకం

ఒకాయన చనిపోయాక స్వర్గానికి వెళతాడు.

అక్కడ ఓ సంఘ సేవకుడు ఒక కురూపితో కనిపిస్తాడు. ఉండబట్ట లేక ఆ వ్యక్తి అక్కడున్న భటుడ్ని అడుగుతాడు. “ఓ అదా, ఆ సంఘసేవకుడు తన పెళ్ళాంని కొట్టేవాడు. అందుకే శిక్షగా కురూపితో కలసి ఉండాల్సి వస్తోందని..“ చెబుతాడు భటుడు.

కొంచెం ముదుకెళ్ళాక ఆ వ్యక్తికి ప్రజలని దోచుకున్న ఓ రాజకీయ నాయకుడు అందమైన అమ్మాయిలతో కనిపిస్తాడు. అశ్చర్యంగా “ఇదేమిటి? నాకు తెలిసి ఈ రాజకీయనాయకుడు పరమ దుర్మార్గుడు. ప్రజల సొమ్ము కాజేసాడు. ఇతనికీ ఈ సుఖాలా? “అని మరలా ప్రశ్నించాడు. మెల్లగా చెప్పాడు భటుడు.

“ఏమీ లేదు ఆ అందమైన అమ్మాయి తన జీవితంలో అనేక పాపాలు చేసింది. ఆమెకిదే పెద్ద శిక్ష..“

## డిప్రెషన్...



**రాజారావు:** ఏమిటి అలా దిగాలుగా ఉన్నారు? ఏమైనా సమస్య వచ్చిందా?

**గోపాలం:** ఏమీలేదు సమస్యంతా మా అవిడతోనే..

**రాజారావు:** ఏమయ్యిందేమిటి?

**గోపాలం:** ఏమీలేదు ఓ నలభై రోజులు మా అవిడ నాతో మాట్లాడనని శపథం చేసింది.

**రాజారావు:** అలాగా ! హాయిగా పండగ చేసుకోక మరి ఈ డిప్రెషన్ మొహం ఏమిటి?

**గోపాలం:** డిప్రెషన్ కాక, ఈ రోజే అఖరి రోజు...

## తప్పి పోయిన  పెళ్ళాం

ఎగ్జిబిషన్ లో ఓ అందమైన అమ్మాయి దగ్గరకెళ్ళి వినయ్ వెళ్ళి, "నాతో ఓ పదినిమిషాలు మాట్లాడగలరా? " అంటూ అడిగాడు.

" ఎందుకు? " ప్రశ్నించిందా అందమైన అమ్మాయి.

" ఏమీలేదు మా ఆవిడ తప్పి పోయింది. నేను ఎక్కడ ఏ అమ్మాయితో మాట్లాడినా ఠక్కున ప్రత్యక్షం అవుతుంది, అందుకని.. "

## అదీ  విషయం

ఓ రోగి ఆసుపత్రిలో జాయిన్ అవుదామని వెళుతున్నాడు. ఆసుపత్రి బయట తెల్లకోటు, మెడలో స్టెతస్కోపులతో ఓ ఇద్దరు డాక్టర్లు అక్కడ ఏదో వెతుకుతూ కనిపించారు.

"ఏమైనా పోగొట్టుకున్నారా? " రోగి అ డాక్టర్లని ప్రశ్నించాడు.

" ఇప్పుడే ఓ రాజకీయ నాయఖుడికి హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ చేస్తున్నాం. ఇక్కడెక్కడైనా ఓ పెద్ద రాయి దొరుకుతుందేమోనని.. చూస్తున్నాం"

## శలవు 

రాంబాబు తన మేనేజరు దగ్గరకెళ్ళి " బాస్ రేపు మా ఇంట్లో సున్నం కొట్టించాలి. చాల పని ఉందని మా ఆవిడ శలవు పెట్టమంది..కాబట్టి రేపు శలవు కావాలి. "

" నో ! శలవు ఇవ్వడం అస్సలు కుదరదు" మేనేజరు

"థాంక్స్ బాస్! ఆనమ్మకంతోనె నేనూ ఉన్నాను." రాంబాబు ఊపిరి పీల్చుకున్నాడు.

## వేడా?

డాక్టర్: ఈ పేషంటు టెంపరేచరు తీసారా?

నర్సు: తీయలేదు., ఏం కనిపించడం లేదా?

# అంజనం

.సుందరి భర్త రెండేళ్ళ క్రితం పోయాడు. సుందరి తన భర్త తిథి రోజున ఓ అంజనం వేసే ఒకాయన్ని పిలిపించింది. అంజనం వేసే అతను సుందరి భర్త, సుబ్బారావు మాట వినిపిస్తానని చెప్పి.. సుబ్బారావుతో మాట్లాడ వచ్చని .సుందరికి చెబుతాడు. అన్న ప్రకారం సుబ్బారావు కనిపించడు కానీ మాట మాత్రం వినిపిస్తుంది.

“ ఏమండీ ఎలా ఉన్నారండీ.. మీరు లేని లోటు అనుక్షణం కనిపిస్తోంది.. మీ కిష్టమని ఈ రోజు గుత్తి వంకాయ కూర వండాను. పెసరట్టు వేసాను.. వేళకి తిండి తింటున్నారా?

“ నువ్వేం దిగులు పడకు సుందరీ ఈ జన్మ హాయిగా ఉంది. ఉద్యోగం చెయ్యాలన్న బాధ లేదు. ఏ మాత్రం కష్ట పడకుండా కావలిసినంత తిండి తింటున్నాను. చీకూ చింతలు అస్సలు లేవు.. రోజూ లేవడం, తినడం పడుకోవడం..ఎంతో హాయిగా ఉందంటే నమ్ము..“

“ ఇంతకీ మీరు ఇక్కడున్నారిప్పుడు..? “

“ ఓ అదా... మన ఇంటి ముందు పొలం దగ్గర ఉన్నాను.“

“ అదేమిటి పొలం దగ్గర ఉన్నారా...నాకేమీ కనిపించలేదే ఎప్పుడూ..“

“ మన పొలం దగ్గరున్న గేదె నేనే... “

సుబ్బారావు ఇది చెప్పి అంతర్ధానమయ్యాడు.

డోసు మార్చాను ..  ఈసారి తగ్గాలని దేవుణ్ణే ప్రార్థిస్తా